క్లుప్తంగా

తీలేర్ యువకుడు అగ్నిపథ్‌కు ఎంపిక



మరికల్: మండలంలోని తీలేర్‌కు చెందిన వ్యవసాయ రైతు వెంకటేష్, లక్ష్మీ దంపతుల కుమారుడు రాజేష్ అగ్నిపథ్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో సత్తా చాటడంతో సైనికుడిగా ఎంపికై దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తించనున్నాడు. ఆర్మీకి ఎంపిక కావడానికి రెండేళ్ల నుంచి పట్టుదలతో కష్టపడటం వల్లే సైనికుడిగా ఎంపికైనట్లు యువకుడు తెలిపాడు. ఆర్మీకి ఎంపికైన రాజేష్‌ను గ్రామస్తులు అభినందించారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడికి సన్మానం



మాగనూర్(మక్తల్): మక్తల్ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడుగా సత్యాంజనేయులు ఎన్నికైన సందర్భంగా ఆయనను జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడుగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. స్వతహాగా క్రీడా అభిమానిగా ఉన్న సత్యాంజనేయులు క్రీడా అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, ఇప్పుడు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించి క్లబ్ ప్రతిష్ఠను పెంచాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, వెంకటేష్, గౌతమ్, మహేశ్వరి, సమత, అంజలి, మల్లీశ్వరి, కీర్తి పాల్గొన్నారు.

కుంగిన కల్వర్టు.. రాకపోకలకు ఇబ్బందులు



ధన్వాడ: మండల కేంద్రంలోని కంసాన్‌పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో మారుతీనగర్ వద్ద కల్వర్టు కుంగిపోయింది.గత కొన్ని రోజులుగా టిప్పర్లు, లారీలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించడంతో వాటి బరువుకు కల్వర్టు ఓ చోట కుంగిపోయింది.దీంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ప్రచారం



మద్దూరు: మద్దూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యాబోధన, కల్పిస్తున్న వసతుల గురించి వాల్‌పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేసి కళాశాలలో చేరాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మద్దూరు పరిసర ప్రాంతాలలో ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే దోస్త్‌లో మొదటి ప్రాధాన్యతగా మద్దూరు కళాశాల కోడ్ 3113ను ఎంచుకోవాలని సూచించారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన



మద్దూరు: కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీపై బీహార్‌లో కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మద్దూరు పట్టణంలో పాతబస్టాండ్ చౌరస్తాలో శనివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మోదీ ప్రభుత్వం రాహుల్‌గాంధీకి వస్తున్న ఆదరణను చూసి భయపడి ఇలాంటి చర్యలకు దిగుతుందని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజల పక్షాన దేశవ్యాప్తంగా పోటరాం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయే అని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ నాయకులు రెడ్డి శ్రీను, కృష్ణంరాజు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

అమరచింత: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం జోరు వర్షం కురిసింది. వర్షం ధాటికి గ్రామాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. నిన్న మొన్నటి వరకు ఎండ వేడిమితో ఇబ్బంది పడిన జనం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేశారు. భారీ వర్షానికి చిన్న చిన్న కుంటలు నీటితో నిండిపోయాయి.

గుంతల రోడ్లు.. ప్రయాణికుల పాట్లు

- అధ్వానంగా మురహర్‌దొడ్డి, ఐనాపూర్, చేగుంట రోడ్లు
- ఐదేళ్లుగా మరమ్మతుకు నోచుకోని వైనం



అధ్వానంగా మురహర్‌దొడ్డికి వెళ్లే రోడ్డు



గుంతలమయంగా ఐనాపూర్ రోడ్డు

కృష్ణా: రాష్ట్రంలో ప్రభుత్వాలు, పాలకులు మారినా పల్లెల పరిస్థితుల్లో మార్పులు రావడం లేదు. నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండలంలోని పలు గ్రామా లకు మట్టిరోడ్లు కూడ సరిగా లేకపోవడంతో ప్రజ లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని టైరోడ్డు నుంచి మురహర్‌దొడ్డి, చేగుంట నుంచి ఐనాపూర్ గ్రామాల మధ్య రాకపోకలు సాగించా లంటే నరకం చూడాల్సి వస్తుంది. ద్విచక్ర వాహనదారులు సైతం రాకపోకలు సాగించాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో అయితే ఈ రోడ్ల దుస్థితి మరింత దారుణంగా ఉంటుంది. రోడ్డుపై నీళ్లు నిలవడంతో గుంతలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ గ్రామాల ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదు. ఎన్నికలలో హామీలు ఇస్తున్నారు తప్పించి సమస్యలను పరిష్కరించడానికి ఏ నాయకుడు కూడ ప్రయత్నించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని లేకపోతే కనీసం మరమ్మతులైన చేయించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి



గుంతల మయంగా మారిన రోడ్లపై ప్రయాణించాలంటే భయం వేస్తుంది. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఈ రోడ్డుకు మరమ్మతు చేయించాలని అటు అధికారులకు, ఇటూ ప్రజా ప్రతి నిధులకు అనేక సార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– చంద్రప్ప, రైతు, మురహర్‌దొడ్డి

సర్వే చేసి రిపోర్టు పంపించాం



మండలంలో దెబ్బతిన్న బీటీ రోడ్లకు బాగు చేయడానికి ప్రభుత్వం ఓ కొత్త పథకాన్ని ప్రారంభించింది. అదే హెచ్ఏఎం (హైబ్రీడ్ హామీటి మోడల్) పథకం. మురహర్‌దొడ్డి, కుసుమర్తి, ఐనాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను సర్వే చేసి బాగు చేయడానికి ఈ పథకం కింద ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. నిధులు మంజూరు కాగానే చర్యలు చేపడతాం.

– మారుతీ, ఏఈ

బక్రీద్ శాంతియుతంగా జరుపుకోవాలి



ఇరువర్గాలతో సమావేశమైన సీఐ శివశంకర్



వధశాలల ఆర్గనైజర్లతో మాట్లాడుతున్న పోలీసులు

నారాయణపేట: బక్రీద్ పండుగ సందర్భంగా వధశాలల ఆర్గనైజర్లు నిబంధనలు పాటించాలని సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం నారాయణపేట పోలీస్‌స్టేషన్‌లో వధశాలలకు చెందిన ఆర్గనైజర్లతో వారు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. గోవులను అక్రమ రావాణా చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బక్రీద్ పండగ రోజు గొర్రెలను కోసేవారు వాటి వ్యర్థాలను పరిసరాలకు దూరంగా వేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వధశాలలో జంతువులను వదించాలంటే వెటర్నరీ డాక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలని లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ రేవతి, వధశాలల ఆర్గనైజర్లు ఉన్నారు.

ఇరు వర్గాలతో శాంతి సమావేశం

మద్దూరు: బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ విజయ్‌కుమార్ ముస్లిం మతపెద్దలకు సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం, బగరంగదళ్, విశ్వహిందూ పరిషత్, గోరక్షణ కమిటీ నాయకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ముస్లింలు వెటర్న రీ డాక్టర్ సర్టిఫైడ్ చేసినా పశువులనే వధించాలని సూచించారు. అలాగే హిందు సంఘాల యువకులు చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండా గోవుల అక్రమ రవాణాపై తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మస్జిద్ కమిటీల సభ్యులు, హిందు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

కోస్గి రూరల్: బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ సైదులు అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, హిందూ సంఘాల నాయకులతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆవులను వధిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతలకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

చిన్నపొర్లలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపు



ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో సమ్మర్‌క్యాంపు కొనసాగుతుంది. ఉపాధ్యాయుడు తిరుపతయ్య ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. ఉపాధ్యాయులు రేవతి, సుష్మ విద్యార్థులకు కథలు, వినోద కృత్యాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఈదురు గాలులకు కూలిన రేకుల షెడ్



మరికల్: ఈదురు గాలులతో కూడిన వర్షం కురువడంతో రేకుల షెడ్ కూలి ఒకరికి తీవ్రగాయాలైన ఘటన శనివారం మరికల్‌లో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని జిన్నారానికి చెందిన మౌలాలీ, భవాని వైన్స్ ఎదుట రేకుల షెడ్ ఏర్పాటు చేసుకొని మటన్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ ఈదురు గాలులు వచ్చి రేకుల షాపు కూలిపోవడంతో అందులో ఉన్న మౌలాలీ కాలు విరిగింది. చికిత్స నిమిత్తం అతడిని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈదురు గాలులకు మండల కేంద్రంలో అక్కడక్కడ రేక్కుల షెడ్లు కూడా ఎగిరిపోవడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశుగ్రాసం దగ్ధం



గండేడ్: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పశుగ్రాసం కాలిపోవడంతో పాటు డీసీఎం పాక్షికంగా దెబ్బతిన్నది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అంచన్‌పల్లి గ్రామానికి చెందిన చాపల మాసయ్య తన డీసీఎం లో నిత్యం పశుగ్రాసం (చొప్ప) తరలించేవాడు. ఎప్పటిలాగే శనివారం సల్కర్‌పేట్ సమీపంలో డీసీఎం లోడు చేశారు. వాహనాన్ని స్టార్టు చేయగానే మంటలు వ్యాపించి పశుగ్రాసానికి అంటుకుంది. వెంటనే అక్కడున్న కూలీలు స్పందించి నీళ్లు పట్టి మంటలు ఆర్పారు. పశుగ్రాసం దాదాపుగా పూర్తిగా కాలిపోయింది. డీసీఎం పాక్షికంగా దెబ్బతిన్నది. సకాలంలో స్పందించి మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

‘ఉపాధి’ పనులు పర్యవేక్షించాలి



ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింహులు

అడ్డాకుల: గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఆర్‌డీఓ నర్సిములు అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం జరిగిన 4వ విడత సమాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా ఎన్ఆర్ఈజీఎస్‌లో రూ.3.33కోట్లు, పీఆర్‌లో రూ.1.41కోట్ల పనులు జరిగాయి. వాటిపై ఇటీవల తనిఖీ బృందం గ్రామాల్లో విచారణ చేపట్టి నివేదిక రూపొందించారు. ఏపీడీ ముసాయిదాబేగం, ఫైనాన్స్ మేనేజర్ ప్రేమలత, అంబుడ్స్‌మెన్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజావేదికకు డీఆర్‌డీఓ నర్సింహులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొక్కల పెంపకంలోనే ఎక్కువగా అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందం గుర్తించింది. తక్కువ సంఖ్యలో మొక్కలు నాటి, ఎక్కువ రికార్డు చేయించడం, వాటర్ ట్యాంకర్ పేమెంట్ చేసినా చాలా చోట్ల మొక్కలు ఎక్కువగా ఎండిపోవడం నివేదికలో వెల్లడైంది. దీంట్లో చక్రాపూర్, నందిపేట, దాసర్‌పల్లి, స్ఫూర్తితండా, కొమిరెడ్డిపల్లి గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సిఫారసు చేసినట్లు ఎస్ఆర్‌పీ కె.స్వామి తెలిపారు. తనిఖీ బృందాలు గుర్తించిన దాంట్లో మండల వ్యాప్తంగా సుమారు రూ.54లక్షల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించగా ప్రజావేదికలో మాత్రం అధికారులు రూ.వేలల్లోనే ఉందని లెక్క తేల్చడం గమనార్హం. మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులను సరిగ్గా పర్యవేక్షించలేదని విచారణ సందర్భంగా పలుమార్లు ఎంపీడీఓ కృష్ణయ్యను డీఆర్‌డీఓ మందలించారు.

సత్వర న్యాయానికి లోక్ అదాలత్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భావన

మహబూబ్‌నగర్ రూరల్: చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఎవరికైతే న్యాయ సహాయ సహకార సంరక్షణ, జీవనోపాధి కోసం అవసరం ఉన్న వ్యక్తులు జిల్లా న్యాయసేవా సమితి నుంచి ఉచిత న్యాయ సహాయ, సహకారాలు అందిస్తామని జూనియర్ సివిల్ జడ్జి భావన అన్నారు. శనివారం మండల పరిధిలోని అమిస్తాపూర్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి భావన గృహ నిరోధక చట్టం, బాల్య వివాహాలు, వరకట్న నిషేధ చట్టం, విడాకులు, వైవాహిక సంబంధాల పునరుద్ధరణ, కుటుంబ తగాదాలు, ఎఫ్ఐఆర్, ర్యాగింగ్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వతర న్యాయానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దార్ సుందర్‌రాజ్ మాట్లాడుతూ కుటుంబానికి ఆరోగ్యపరంగా, సామాజికపరంగా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సభ్యులు ముఖ్య పాత్ర వహించాలన్నారు. ఎంపీడీఓ కరుణశ్రీ మాట్లాడారు. ఈ సదస్సులో ప్యానల్ న్యాయవాదులు శివరాజ్, మల్లారెడ్డి, రవీంద్రనాయక్, పీఎల్‌వీ నాగభూషణం, కాడం రాఘవేందర్, శివన్న, రాము, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే

మాగనూర్(మక్తల్): మక్తల్ మండలంలోని ముస్లాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గోవింద్ శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆయన నివాసానికి వెళ్లి పార్థీవ దేహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన వంతుగా ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

తుదిదశకు ఎంపీడీఓ కార్యాలయ పనులు



నిర్మాణంలో ఉన్న ఎంపీడీఓ కార్యాలయం

అమరచింత: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఎంపీడీఓ కార్యాలయం పనులు తుది దశకు చేరుకున్నట్లు ఎంపీడీఓ నరసింహులు తెలిపారు. మండలం ఏర్పాటైనప్పటి నుంచి ఎంపీడీఓ కార్యాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల స్థానిక ఉర్దూ మీడియం పాఠశాలలో కొన్ని గదులను వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం ఇవ్వడంతో కార్యాలయానికి తగినట్లుగా పనులు చేపట్టారు. ఈ పనులు తుదిదశకు చేరుకున్నాయని త్వరలోనే ఎమ్మెల్యే చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులకు అరటి పండ్లు అందజేస్తున్న భోగేశ్వర్

నారాయణపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో నెల రోజుల పాటు జరిగే ఉచిత క్రికెట్ కోచింగ్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి క్రీడాకారులకు పండ్లు పంపిణీ చేశారు. క్రీడాకారులకు ఇది సువర్ణ అవకాశం అని, కేవలం చదువుపై దృష్టి పెట్టకుండా క్రీడలలోనూ రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. అనంతరం సమ్మర్ క్రికెట్ ఇన్‌చార్జి రమణ మాట్లాడుతూ.. అండర్–19, అండర్–23 జిల్లా క్రికెట్ జట్లను ఇటీవలే ఎంపిక చేశామని ఆ జట్లు ఈ నెల 19, 20 తేదీలలో నారాయణపేట, గద్వాల్ జిల్లా జట్లతో పోటీపడతాయన్నారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా అథ్లెటిక్ కోచ్ హారిక దేవి, క్రికెట్ కోచ్ అజయ్, చెన్నారెడ్డి, సురేందర్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి



బ్యాంకును ప్రారంభిస్తున్న విజయ్ కుమార్

నారాయణపేట రూరల్: బ్యాంకుల ద్వారా కస్టమర్లకు నాణ్యమైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని ఎల్‌డీఎం విజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డబ్బులు దాచుకునేందుకు, అవసరమైన సమయంలో అప్పుగా పొందేందుకు బ్యాంకులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. హైదరాబాద్ సర్కిల్లో 72వ బ్రాంచీగా నారాయణపేటలో పీఎన్‌బీ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసే నగదుపై 390 రోజులకు 7 శాతం వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. బంగారంపై ఒక గ్రాముకు రూ.7500 వరకు గోల్డ్ లోన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు సేవలను పట్టణ, పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ హెడ్ డీజీఎం అరవింద, తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు రమణమూర్తి, బ్యాంకు మేనేజర్ డానియల్, క్యాషియర్ విష్ణు, అధికారి నర్సప్ప పాల్గొన్నారు.

జూలై 19కు జాతీయ సమ్మె వాయిదా



కరపత్రాలు విడుదల చేసిన నాయకులు

మద్దూరు: కేంద్రం తీసుకొచ్చిన రైతు, కార్మికుల చట్టాలకు వ్యతిరేకంగా ఈనెలం 20న చేపట్టిన జాతీయ సమ్మెను జూలై 9న నిర్వహించనున్నట్లు అఖిలభారత ఐక్యరైతు సంఘం (ఏఐయూకేఎస్) నాయకులు తెలిపారు. ఈ మేరకు సమ్మెకు సంబంధించిన కరపత్రాలను శనివారం మండలంలోని చెన్వార్, అప్పిరెడ్డిపల్లి, అచ్చంపల్లి, రెనివట్ల, మోమినాపూర్, చెన్నారెడ్డిపల్లి, పెదిరిపాడ్, నాగంపల్లి, దమ్‌గాన్‌పూర్, పల్లెర్ల గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. నూతన జాతీయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యాదగిరి, కొండ నర్సిములు, ఉశప్ప, ఆంజనేయులు, అంజి, రాములు, శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

ఖాతాల్లో నగదు జమ చేయాలి



మాజీ ఎంపీటీసీ బలరాంరెడ్డి

మాగనూర్ (మక్తల్): జిల్లా పౌరసరఫరాల శాఖ అలసత్వంతో మక్తల్ మండలంలోని అన్ని గ్రామాల రైతులు అవస్థలు పడుతున్నారని మాజీ ఎంపీటీసీ బలరాంరెడ్డి విమర్శించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాల్లో వేలాది మంది రైతుల నుంచి వడ్లను కొనుగోలు చేశారన్నారు. అయితే కొనుగోలు చేసిన వడ్లను జోగులాంబ గద్వాల్ జిల్లాలోని ఎర్రవల్లి ఎస్ఆర్‌టి రైస్ మిల్లుకు పంపగా ఇప్పటి వరకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారుల నుంచి మిల్లు యాజమాన్యానికి ఓపీఎంఎస్ జారీ చేయలేదన్నారు. దీంతో రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదని మండిపడ్డారు. వడ్లను విక్రయించి నెలరోజులు గడుస్తున్నా నేటికీ డబ్బులు పడకపోవడంపై అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘జూరాల’ మెట్ల మార్గాన్ని బాగు చేయండి



దెబ్బతిన్న మెట్ల మార్గం

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ భాగంలో నది దిగువ భాగానికి వెళ్లేందుకు నిర్మించిన మెట్ల దారి ఇటీవల ధ్వంసమైంది. ప్రాజెక్టు పైభాగం నుంచి వచ్చే కృష్ణా నది పరవళ్లను నేరుగా చూసేందుకు పర్యాటకులకు ఈ మెట్ల మార్గం వీలుగా ఉండేది. అయితే ప్రస్తుతం మెట్ల మార్గం శిథిలం కావడంతో మరమ్మతులు చేసేవారే కరువయ్యారు. వచ్చే నెల నుంచి జూరాలకు వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉండడంతో కృష్ణా నది అందాలను తిలకించేందకు పర్యాటకులు వస్తుంటారు. అధికారులు స్పందించి మెట్లను బాగు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పకడ్బందీగా ఉపాధ్యాయుల శిక్షణ



మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటనర్సమ్మ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల శిక్షణ పకడ్బందీగా, ఎటువంటి లోటు పాట్లకు తావు లేకుండా నిర్వహించాలని విద్యాశాఖ సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీ వద్ద ఉన్న మైనార్టీ గురుకులంలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై శిక్షణ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రవీణ్‌కుమార్‌తో సమావేశమై పలు అంశాలతో చర్చించారు. ఎంత మంది ఉపాధ్యాయులకు శిక్షణకు వస్తున్నారని, ప్రస్తుతం ఏ అంశాలపై శిక్షణ ఇస్తున్నారని, రెండో దశంలో ఎంత మంది ఉపాధ్యాయులు హాజరవుతారని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల శిక్షణలో పూర్తి స్థాయిలో అంశాలను అవగాహన కలిగేలా చూడాలన్నారు. దీంతో పాటు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శివయ్య, వయోజన విద్య జిల్లా అధికారితో పాటు పలువురు అధికారులను పలు కార్యక్రమాలపై వివరాలు అడి గి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, పాల్గొన్నారు.